క్లుప్తంగా

వైభవంగా వెంకటేశ్వర స్వామి వారి గ్రామోత్సవం

కంభం: స్థానిక కాపవీధిలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి గ్రామోత్సం వైభవంగా నిర్వహించారు. ఉదయం దీక్ష హోమం, బలిహారణ, ప్రత్యేక పూజల అనంతరం రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు కుమారుడు అన్నా కృష్ణచైతన్య ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

మార్కాపురం టౌన్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ బాబురావు ఆదేశించారు. సోమవారం సాయంత్రం మార్కాపురంలోని డ్వాక్రా బజారులో మార్కాపురం, తర్లుపాడు మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 19లోగా ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి ఉండాలని చెప్పారు. స్త్రీనిధి, జగనన్న తోడు, లైవ్ స్టాక్, జగనన్న ఉన్నతి కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం హర్షవర్ధన్, మేనేజర్ సులోచన, ఏపీఎంలు రమేష్‌బాబు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవుని రథోత్సవం

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతి సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. రథోత్సవ కార్యక్రమానికి ఉభయదాతలుగా గొండ్ల కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. మంగళవారం వసంతోత్సవం, బుధవారం ఏకాంతసేవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా సీతారామస్వామి విగ్రహ ప్రతిష్ట

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నల్లబండ బజారు సీతారామస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు కామూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో వరుసగా మూడు రోజుల పాటు భక్తులకు అన్నదానం చేశారు. ప్రతిష్టమహోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

దర్శి టౌన్: దర్శి నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ జీఎల్ ప్రసాద్ ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. న్యాయవాదులు సుబ్బారెడ్డి, మనోహరమ్మలు మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. న్యాయపరమైన సాయం, అవగాహన కోసం లోక్ అదాలత్ చేస్తున్న కృషిని వివరించారు.

యోగా తరగతులు ప్రారంభం

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా తరగతులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఎంపీపీ గుమ్మా పద్మజ, గుమ్మా యల్లేష్‌లు తమ కుమారుని జ్ఞాపకార్థం వేసవిలో వినియోగించే యోగా దుస్తులు విద్యార్థులకు అందజేశారని ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసులు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు షేక్ అబ్దుల్ సలాం తెలిపారు. శిక్షణ తరగతులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మే నెల 1వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. యోగా మాస్టర్స్ మహేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.సుబ్రహ్మణ్యం, పి.రామానాయక్ పాల్గొన్నారు.

రెడ్డి హాస్టల్‌కు స్థలం కేటాయించాలి

మార్కాపురం: స్థానిక సౌజన్య ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి పలువురు హాజరై అర్జీలు అందజేశారు. పేద రెడ్డి విద్యార్థుల హాస్టల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కలెక్టర్ దినేష్ కుమార్, ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి రెడ్డి సంక్షేమ సేవా సంఘ నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి వినతి పత్రం అందించారు. అలాగే దివ్యాంగులు, వయోవృద్ధులు, హిజ్రాలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు డి.గోపాల్‌రెడ్డి వినతి పత్రం ఇచ్చారు. 2020లో ఎంపీ ల్యాడ్స్‌తో అలీంకో సంస్థ వారు క్యాంప్ నిర్వహించి ఉపకరణాలు మంజూరైనా ఇంతవరకు పంపిణీ చేయలేదని వాటిని వెంటనే అందించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

తాళ్లూరు: కొర్రపాటివారిపాలెంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, మద్దిశెట్టి యూత్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. ప్రయాణికుల దాహార్తి కోసం వైఎస్సార్ సీపీ తాళ్లూరు మండల ఇన్‌చార్జి మద్దిశెట్టి రవీంద్ర సూచనల మేరకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు జేసీఎస్ గ్రామ కన్వీనర్ విష్ణు తెలిపారు.

కదం తొక్కిన కార్మిక లోకం



ఒంగోలులోని విద్యుత్ భవన్ ముందు మే డే వేడుకలు నిర్వహిస్తున్న 1104 యూనియన్ నాయకులు



ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలో...

- ఘనంగా మే డే వేడుకలు
- వాడవాడలా రెపరెపలాడిన ఎర్రజెండాలు

ఒంగోలు సబర్బన్: కార్మిక లోకం కదం తొక్కింది. కార్మిక దినోత్సవం మే డేను పురస్కరించుకుని వాడవాడలా ఎర్రజెండా రెపరెపలాడింది. సోమవారం ఒంగోలు నగరంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్థానిక రాంనగర్‌లోని విద్యుత్ భవన్ ముందు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-1104 ఒంగోలు డివిజన్ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన యూనియన్ జెండాను ఏపీసీపీడీసీఎల్ డిస్కం అధ్యక్షుడు రాచగర్ల సంజీవరావు ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో...

ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూనియన్ జెండా ఎగురవేసి నినాదాలు చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కట్టా రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఉప కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో...

ఒంగోలు: స్థానిక ఉప కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు పాల్గొని మాట్లాడారు. ప్రావిడెంట్ ఫండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ నరేంద్ర, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, సహాయ కార్మిక శాఖ కమిషనర్ కె.దుర్గభవాని, సహాయ కార్మికశాఖ కమిషనర్లు బి.అనిత, కె.పవన్‌కుమార్, సహాయ కార్మిక అధికారి యం.ఎలిజెబెతమ్మ. తదితరులు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలతో కార్మికుల హక్కులు సాధిస్తాం...

ఒంగోలు టౌన్: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు సమరశీల పోరాటాలతో జవాబు చెబుతామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పూనాటి ఆంజనేయులు అన్నారు. మే డే ను పురస్కరించుకుని స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. సుందరయ్య భవన్‌పై ఎర్రజెండా ఎగరేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు జాలా అంజయ్య, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో అన్నదానం...

మే డేను పురస్కరించుకుని ఒంగోలు బైపాస్ రోడ్డు సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 500 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఎం.సుబ్బారెడ్డి అధ్యక్షత వహించగా, సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు జి.రమేష్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా సుందరయ్య భవన్లో స్ట్రీట్ వెండర్స్ యూనియన్ నేతృత్వంలో అరుణపతాకాన్ని ఎగరేశారు.

కార్మిక చట్టాలను కాపాడుకుందాం...

కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో నడుస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కిన కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు కార్మికులంతా ఏకం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీఐ, ఏఐటీయూసీ నేతృత్వంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. సీపీఐ కార్యాలయం, అద్దంకి బస్టాండు సెంటర్, డీమార్ట్ సెంటర్, ఆర్టీసీ డిపో, కొత్త కూరగాయల మార్కెట్, ఎంఎస్ఆర్ ఆస్పత్రి, పేర్నమిట్ట తదితర సెంటర్లలో ఎర్రజెండాలు ఎగురవేశారు. నగరంలోని ప్రధాన వీధుల్లో భారీ ప్రదర్శన నిర్వహించారు.



ఉప్పుగుండూరులో జెండా ఎగురవేస్తున్న కార్మికులు

సీపీఐ ఎంఎల్ నేతృత్వంలో...

నగరంలోని శర్మ కాలేజీ వద్ద గల సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ కార్యాలయం వద్ద మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ కూడళ్లలో పార్టీ జెండాలు ఆవిష్కరించి మే డే పోరాటాల గురించి వివరించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ప్రగతిశీల మహిళా సంఘ రాష్ట్ర కార్యదర్శి పద్మ, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

కరవదిలో...

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది రైల్వేస్టేషన్ కూడలి వద్ద రైల్వే సంఘాల నేతలు మే డే సందర్భంగా జెండా ఎగురవేశారు. కరవది ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. గుండాయపాలెంలో మత్స్యకార కార్మికులు జెండా ఎగురవేయగా, ఉలిచిలో చేనేత కార్మికులు జెండా ఆవిష్కరించారు. త్రోవగుంటలో ముఠా వర్కర్స్ యూనియన్, త్రోవగుంట ఆటోనగర్‌లో లారీ వర్కర్స్ యూనియన్, మెకానిక్ యూనియన్ల ఆధ్వర్యంలో మే డే జెండాలు ఆవిష్కరించారు. ఐఎల్‌టీడీ కంపెనీల వద్ద పొగాకు కార్మికుల యూనియన్, గ్రేడింగ్ కార్మికుల యూనియన్, వ్యవసాయ మార్కెట్ వద్ద ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు మే డే వేడుకలు నిర్వహించారు.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం కొత్తపట్నంలో కార్మిక సంఘాల నాయకులు, సీఐటీయూ నాయకులు బస్టాండ్ సెంటర్, కాలనీల్లో జెండాలు ఆవిష్కరించారు. కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. అఖిల భారత మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, సీఐటీయూ మండల కార్యదర్శి సూరి స్వామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడదాం...

చీమకుర్తి: రైతులు, కార్మికులపై కేంద్రం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా అందరం కలిసి ఐక్యంగా పోరాడదామని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ సీనియర్ నాయకుడు వైవీ కృష్ణారావు పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా సంతనూతలపాడు మండలం మద్దులూరులో సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జెండా ఆవిష్కరించారు. అదేవిధంగా సంతనూతలపాడు మండలం మైనంపాడు, ఎండ్లూరు, పేర్నమిట్టలో సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలు నిర్వహించారు. ఆయా పార్టీలు, సంఘాలకు సంబంధించిన జెండాలు ఆవిష్కరించారు. మే డే ప్రాధాన్యతను వివరించారు. సీపీఎం, సీఐటీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కాలం సుబ్బారావు, పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. బస్టాండ్ నుంచి పోస్టాఫీస్ వరకు సీఐటీయూ జెండాలతో మెయిన్‌రోడ్డులో ప్రదర్శన లిస్తూ ప్రభుత్వం కార్మికుల పట్ల అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం...

మద్దిపాడు: కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎస్‌కే ఖాసిం అన్నారు. సోమవారం మే డే సందర్భంగా మద్దిపాడులో జెండా ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాలు ఉబ్బా ఆదిలక్ష్మి వెంకటేశ్వర్లు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ బేగ్, మద్దిపాడు మండల కార్యదర్శి హుస్సేన్, రామాంజనేయులు మీరావలి పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉప్పుగుండూరులో భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ర్యాలీ నిర్వహించి వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న పార్కు సెంటర్‌లో మోటార్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ అధ్యక్షుడు పాలపర్తి బాబు సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు తూబాటి శ్రీకాంత్, నలతోటి రామారావు, మోటార్ మెకానిక్ యూనియన్ కార్యదర్శి కందుల శ్రీనివాసరావు, కాంతారావు, శ్యాంసన్, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు. చదలవాడ, అమ్మనబ్రోలు, బీ నిడమానూరు, ఒమ్మెవరం తదితర గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



సుందరయ్య భవన్‌పై ఎర్రజెండా ఎగురవేస్తున్న సీపీఎం నాయకులు



ఒంగోలు బైపాస్‌లో అన్నదానం చేస్తున్న సీఐటీయూ నాయకులు



సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో ఒంగోలులో ప్రదర్శన



కొత్తపట్నంలో వేడుకలు నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



మద్దులూరులో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు



మద్దిపాడులో జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు



నాగులుప్పలపాడులో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రామారావు

ఇంటర్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులు కావాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సుజాత

కొత్తపట్నం: ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదివి ఫెయిలైన విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులు కావడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో పి.సుజాత తెలిపారు. ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదువుతూ ఫెయిలైన విద్యార్థులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటర్ ఫలితాల్లో మన జిల్లాలో ఎక్కువ మంది ఫెయిలయ్యారని తెలిపారు. వారందరినీ పాస్ చేయించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని బాలికలు ప్రభుత్వ కాలేజీలో చదువుతూ ఒకటిరెండు సబ్జెక్టులు ఫెయిలైతే వారికి సింగరాయకొండలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో తరగతులు ఏర్పాటు చేశామన్నారు. ఫెయిలైన విద్యార్థినులను అక్కడకు పంపించాలన్నారు. బాలురకు ఒంగోలులోనే తరగతులు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. సప్లమెంటరీ పరీక్షలకు కోచింగ్ ఇచ్చి నూరు శాతం ఉత్తీర్ణులయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మే 1 నుంచి 20వ తేదీ వరకు కోచింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. కోచింగ్ తీసుకోవడానికి రెండు రోజుల్లోనే వెళ్లాలని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు అవగాహన కల్పించి కోచింగ్‌కు పంపించాలని కోరారు.

హెచ్‌సీఎల్ టెక్‌బీలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి...

కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు హెచ్‌సీఎల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎంపీడీవో సూచించారు. గణితంలో 75 మార్కులు సాధించిన విద్యార్థులకు మే చివరి వారంలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి అర్హత సాధించిన వారికి ఆరు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణకు రూ.1.80 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. నగదు లేని విద్యార్థులకు ఎడ్యుకేషన్ లోన్ వసతి కల్పిస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు జీతాలు వచ్చే విధంగా చేస్తామన్నారు. డిగ్రీ చదువుకునే విద్యార్థులకు బిట్స్ పిలానీ, ఐఐఎం నాగ్‌పూర్, ఆన్‌లైన్ యూనివర్సిటీలలో చదువుకునే అవకాశాలు కూడా ఉన్నాయని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

సచివాలయ సిబ్బంది అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి...

ప్రతి సచివాలయానికి వచ్చే అర్జీలను ఆన్‌లైన్ చేయాలని, విద్యుత్ బిల్లులు కట్టించుకోవడం, అడంగల్ వివిధ సేవలను 25కు తగ్గకుండా అందించాలని ఎంపీడీవో ఆదేశించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం గురించి వివరించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి ఏ బాలచెన్నయ్య, కేజీబీవీ ఎస్వో వి.అరుణకుమారి, సీనియర్ అసిస్టెంట్ కె.సుదర్శన్, జూనియర్ అసిస్టెంట్ పి.తేజ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన భవనంలోకి మారిన లా కాలేజీ తరగతులు



మాట్లాడుతున్న కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రామకృష్ణారావు

ఒంగోలు: స్థానిక అంజయ్య రోడ్డులోని ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ తరగతులు సోమవారం పెళ్లూరు సమీపంలోని కేశవనగర్‌లో నిర్మించిన నూతన భవనంలోకి మారాయి. ఈ సందర్భంగా కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సీవీ రామకృష్ణారావు, కమిటీ సభ్యులు బత్తిన మహేష్, కిషోర్, సాంబశివరావు, కాలేజీ ప్రిన్సిపాల్ నటరాజ్, వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు, ఇతర అధ్యాపకులు శాస్త్రోక్తంగా గణపతి, సరస్వతి పూజలు నిర్వహించారు. అనంతరం సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి రామకృష్ణారావు మాట్లాడారు. 1990లో ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ ప్రారంభమైందని, 2008 నుంచే సొంత భవనం కోసం ప్రయత్నాలు జరిగాయన్నారు. అవి ఇప్పటికి సాకారమయ్యాయన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం లా కాలేజీకి సొంత భవనం తప్పనిసరి అయిందని, అందులో భాగంగానే ఈ నిర్మాణం జరిగిందని వెల్లడించారు. పూర్తి ప్రశాంత వాతావరణంలో మౌలిక వసతులతో కాలేజీ నిర్మించినట్లు తెలిపారు. ఎల్ఎల్‌బీ మూడు సంవత్సరాల కోర్సుకు మరో రెండు సెక్షన్లకు అనుమతి రావడంతో పాటు ఎల్ఎల్ఎంకు సంబంధించి కార్పొరేట్ లా, కాన్‌స్టిట్యూషన్ లాకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినట్లు వివరించారు. ఒక్కో సెక్షన్‌కు 20 మంది విద్యార్థులకు ప్రవేశాలు లభిస్తాయన్నారు. ఎల్ఎల్ఎం కోర్సులు జిల్లాకు రావడం శుభపరిణామంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుంకర సాయిబాబు, శార్వాణి, పి.హేమలత, ఎన్.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ క్లినిక్‌కు 40 కుర్చీల అందజేత



కుర్చీలు అందిస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా చీమకుర్తిలోని అర్బన్ హెల్త్ క్లినిక్‌కు ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి సోమవారం 40 కుర్చీలు అందించారు. ఆస్పత్రిలో రోగులకు వైద్య సేవలు అందించే క్రమంలో కుర్చీలు లేక పడుతున్న ఇబ్బందులను మారం వెంకారెడ్డి దృష్టికి స్థానిక డాక్టర్ జంగా వెంకటేశ్వరరెడ్డి తీసుకురాగా కుర్చీలను అందించారు. ఈ సందర్భంగా వెంకారెడ్డిని డాక్టర్లు, వైద్యసిబ్బంది శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మారం వెంకటేశ్వరరెడ్డి, కోటా రాములు, దశరధరామిరెడ్డి, సురేష్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మంగారి కల్యాణ మహోత్సవం



స్వామివారి మూలవిరాట్



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నాగులుప్పలపాడు: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, కల్యాణ మహోత్సవాన్ని మండలంలోని ఉప్పుగుండూరు, ఒమ్మెవరం, నాగులుప్పలపాడు, కనపర్తి గ్రామాల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆరాధన అనంతరం సోమవారం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఉప్పుగుండూరు గ్రామంలోని బ్రహ్మంగారి ఆలయంలో 330వ ఆరాధన మహోత్సవాన్ని ఆలయ పూజారి గోనుగుంట వీరబ్రహ్మాచారి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఒమ్మెవరం గ్రామంలో పూజారులు, భక్తుల సమక్షంలో స్వామివారి కల్యాణం అనంతరం అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పంచాయతీలకు ఆదాయం

మార్కాపురం టౌన్: గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి పంచాయతీలకు ఆదాయం పెంపొందించే చర్యలు తీసుకోవాలని డీపీఓ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం మండలంలోని రాయవరంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆయన సందర్శించారు. తడి చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేయాలని, పొడి చెత్తను శుద్ధి చేసి అమ్మాలన్నారు. షెడ్ చుట్టూ తీగ జాతి మొక్కలు నాటితే వర్మీ కంపోస్టు త్వరగా తయారవుతుందన్నారు. డివిజినల్ పంచాయతీ అధికారి నాగేశ్వరావు, ఎక్స్‌టెన్షన్ అధికారి రాంమోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీకి 500 ప్రథమ చికిత్స కిట్ల బహూకరణ



కిట్లు అందుకుంటున్న ఆర్టీసీ మేనేజర్ ప్రసాదరావు

ఒంగోలు: ఆర్టీసీకి, పలువురు ఆర్టీసీ సిబ్బందికి మే డేను పురస్కరించుకుని స్థానిక ఉపాస్ హాస్పిటల్ యాజమాన్యం 500 ప్రథమ చికిత్స కిట్లు బహూకరించింది. సోమవారం రాత్రి స్థానిక ఆర్టీసీ గ్యారేజీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్టీసీ ఆర్ఎం బి.సుధాకరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఉపాస్ హాస్పిటల్ యాజమాన్యం ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు రాయితీలు ప్రకటించేందుకు ముందుకు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఫస్ట్ ఎయిడ్ కిట్ల అవసరాన్ని తెలియజేస్తూ పెద్ద ఎత్తున వాటిని ఆర్టీసీకి అందజేయడం ద్వారా కార్మికులతో పాటు ఆర్టీసీ ప్రయాణికుల సంక్షేమాన్ని కాంక్షిస్తుండటం మరింత ఆనందదాయకమని అన్నారు. ఉపాస్ హాస్పిటల్స్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి హెల్త్ కార్డులు ఇస్తామని, ఓపీలో సైతం రాయితీ లభిస్తుందని తెలిపారు. బిల్లులో కూడా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యేక రాయితీ కల్పిస్తామన్నారు. తమ హాస్పిటల్‌లో క్యాన్సర్ మినహా అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే నగరంలో మరో హాస్పిటల్‌లో కూడా తమ సేవలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలలో వాసవీ క్లబ్ ముందంజ



మద్దిరాలపాడు వద్ద వీధి వ్యాపారికి గొడుగు అందజేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

నాగులుప్పలపాడు: సమాజంలోని అన్ని వర్గాల కష్టసుఖాలను పంచుకుని వారికి సేవలందించడంలో వాసవీ క్లబ్ ముందుంటుందని రీజియన్ చైర్‌పర్సన్ చుండూరు గాయత్రి అన్నారు. మండలంలో వివిధ రకాల వీధి వ్యాపారాలు చేసుకుని జీవనం సాగించే వారికి క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా గొడుగులు పంపిణీ చేశారు. ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడు, మద్దిరాలపాడు గ్రామాల్లో వీధి వ్యాపారులకు గొడుగులు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు కొంజేటి సురేష్, సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శ్యామ్యూల్, దేసు రవికుమార్, అమరా సుబ్బారావు, ప్రసాద్, వేణు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.